క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదాన ప్రాంగణంలో ఉన్న న్యాక్ కేంద్రంలో ఎలక్ట్రీషియన్, టైలరింగ్, సీసీ కెమెరా టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఈనెల 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ కేంద్రం ఇన్‌ఛార్జ్ జి.శంకరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించే ఈ శిక్షణకు టెన్త్ ఆపై చదివి 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం జిరాక్స్ కాపీలు, రెండు ఫోటోలను దరఖాస్తుతోపాటు జతచేయాలన్నారు. అభ్యర్థులు నేరుగా పై పత్రాలతో న్యాక్ కేంద్రంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిని వివరాలకు 7989733065, 9032382762 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

స్పాట్ వాల్యుయేషన్ డబ్బులు చెల్లించండి


డీఈఓతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించిన డబ్బులను ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు డీఈఓ శివప్రకాష్‌రెడ్డికి విన్నవించారు. గురువారం ఆయన డీఈఓను కలుసుకుని మాట్లాడారు. టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరైన ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన డబ్బును ఇప్పటివరకు అందజేయకపోవడం తగదన్నారు. వెంటనే డీఈఓ జోక్యం చేసుకుని ఉపాధ్యాయులకు అందవలసిన స్పాట్ వాల్యుయేషన్ సొమ్మును వెంటనే చెల్లించేలా చూడాలంటూ కోరారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బీరునాయక్, కాళిదాస్ చక్రవర్తి, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొత్తపేటలో ఆధార్ క్యాంపు


ఆధార్ సేవలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గురువారం పుల్లంపేట ఈ–సేవ ఆధార్ నిర్వాహకులు సురేష్ ఆధ్వర్యంలో ఆధార్ క్యాంపు నిర్వహించారు. పాఠశాల వద్దకే వెళ్లి చిన్న పిల్లలకు ఆధార్ సేవలు అందించారు. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు పట్టణాధ్యక్షుడిగా నార్జాల మురళి



రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణ కాపునాడు అధ్యక్షులుగా నార్జాల మురళిని నియమించినట్లు గురువారం కాపునాడు రాష్ట్ర కార్యదర్శి కటికం సుబ్రమణ్యం తెలిపారు. 20 సంవత్సరాలుగా కాపు సంఘాలలో మురళి సేవలను గుర్తించి పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు చెప్పారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అజంతుల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ పీఓ రఘురామయ్య, అధ్యాపకులు భాస్కర్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్, రమేష్, రాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి పూజలు


ప్రత్యేక అలంకారంలో సాయినాథుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించి అలంకరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వాసవీ క్లబ్ కేబినెట్ సెక్రటరీ పెండ్యాల విజయ్ కుమార్ పుట్టినరోజు పురస్కరించుకొని ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ గాదంశెట్టి సుమన్ కుమార్, క్లబ్ ప్రెసిడెంట్ తిరునామల కుమార్, ట్రెజరర్ కలువ సోమశేఖర్, గర్రె సత్యనారాయణ, గర్రె నరసయ్య, చెక్క అశోక్ కుమార్, వేమ మంజుల, గర్రె విజయలక్ష్మి, తెర్ల సునీత తదితరులు పాల్గొన్నారు.

రామయ్యా.. వసతులు కల్పించవయ్యా

- అన్నమయ్య భజన బృందానికి వసతులు కల్పించాలంటున్న భక్తులు
- అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదంటున్న భజన బృందం సభ్యులు


కోదండ రామస్వామి ఆలయం వద్ద సంకీర్తనలు భజన చేసే అన్నమయ్య భజన బృందం సభ్యులు


ఆలయం ఎదుట శ్రీరామ సంకీర్తనలను ఆలపిస్తున్న భజన బృందం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం ఎదురుగా దాదాపు రెండు సంవత్సరాల నుంచి ప్రతిరోజు అన్నమయ్య భజన కళాక్షేత్రం తిరుపతి వారు జిల్లాలోని భజన బృందాలతో శ్రీరామ సంకీర్తనలు భజన రూపంలో పాడుతున్నారు. ఇన్ని సంవత్సరాల నుంచి వారు ప్రతిరోజూ భజన బృందాలతో రామ సంకీర్తనలు పాడిన వీరికి కనీస వసతులు కూడా కల్పించలేని పరిస్థితిలో టీటీడీ ఉందని అక్కడికి వచ్చే భక్తులు వాపోతున్నారు. వీరు భజన చేసే సమయంలో ఎండకు, వానకు, గాలికి ఇబ్బంది పడాల్సిందే తప్పా వీరికి ప్రత్యామ్నాయంగా ఒక మండపం ఏర్పాటు చేయలేని పరిస్థితిలో టీటీడీ ఉందా అని మండల ప్రజలు మండిపడుతున్నారు. దీంతో రామ సంకీర్తన చేసే భజన బృందంపై టీటీడీకి చిన్న చూపా అని మండల ప్రజలు, రామ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ రామ భజన చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి వారి సొంత ఖర్చులతో ఒంటిమిట్టకు చేరుకుంటున్నారు.

వాళ్లు ఇన్ని రోజులు నుంచి వారి సొంత ఖర్చులతో వస్తున్నారంటే కారణం అది కేవలం ఆ శ్రీరామచంద్రుడిపై ఉన్న భక్తే కారణమని చెబుతున్నారు. వారి కష్టాలను దృష్టిలో ఉంచుకొని దయవుంచి తిరుమల–తిరుపతి దేవస్థానం వారు అన్నమయ్య భజన కళాక్షేత్ర భజన బృందానికి కనీస వసతులు కల్పించాలని రామ భక్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించండి



ఇక్కడ అన్నమయ్య భజన కళాక్షేత్రం తిరుపతి భజన బృందం వారు రామ భజన చేసే విషయం ఒంటిమిట్ట ఆలయ టీటీడీ పరిపాలనాధికారికి సైతం తెలుసని, ఇది వరకే తమ కష్టాలు ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని గతంలో చెప్పారన్నారు. కానీ గత బ్రహ్మోత్సవాల నాడు టీటీడీ జేఈఓ దృష్టికి తీసుకెళ్లగా వారి వద్ద నుండి ఎలాంటి స్పందన రాలేదు. అయినా నిరుత్సాహం చెందకుండా భజనలు కొనసాగిస్తున్నాం. దయచేసి తమ ఇబ్బందులను గుర్తించి తమకు కనీస వసతులు కల్పించాలని కోరుతున్నాం. అందులో ముఖ్యంగా రవాణా ఖర్చు, భజన బృందం కార్యక్రమం నిర్వహించేందుకు ఒక మండపం, ఒంటిమిట్ట ఆలయ ప్రాంగణం మొత్తం తమ భజన వినిపించేందుకు నాణ్యమైన మైక్‌సెట్, దూర ప్రాంతాల నుంచి వచ్చి రాత్రిపూట వెళ్లలేని వారు ఉండేందుకు ఒక గదిని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

– సాంబయ్య, అన్నమయ్య భజన కళాక్షేత్రం తిరుపతి, కడప జిల్లా అధ్యక్షులు

శీతల గంగమ్మా.. శరణు చూపవమ్మా


అమ్మవారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు


దర్శనమిస్తున్న శీతల గంగమ్మ

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ జాతర సందర్భంగా గురువారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి బోనాలు, బలులను అర్పించి మొక్కుబడులను తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు బారుతీరారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ముద్దపూజ, పుణ్యహవాచనం, సహస్రనామార్చన, కుంకుమార్చన, ఆకుపూజ, మహానైవేద్యం వంటి పూజా కార్యక్రమాలను జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయా, కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. జాతర సందర్భంగా గ్రామస్తులు, నాయకులు బంధువులను, స్నేహితులను పిలుచుకొని విందు భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకొని గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. జాతరలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్నలు బందోబస్తును ఏర్పాటు చేశారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

గాలివీడు : మండలంలోని తూముకుంట గ్రామంలో సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో గురువారం చిన్న పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అన్న ప్రాసన, గ్రాడ్యుయేషన్ ఉత్సవం, గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ డయేరియాపై అవగాహన కల్పిస్తూ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సోని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి


అవగాహనా కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నాగార్జున

రైల్వేకోడూరు అర్బన్ : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్‌డీ నాగార్జున గురువారం తెలిపారు. మండలంలోని ఎస్.ఉప్పరపల్లి పంచాయతీలో సర్పంచ్ కవితా చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ తదితర క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాలన్నారు. మురికి గుంతలు, మురికి కాలువలలో బ్లీచింగ్ చల్లాలని సూచించారు. పంచాయతీ అధికారులందరూ అప్రమత్తంగా ఉండి గ్రామాలలో ముఖ్యంగా దోమలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలెంకోట రత్నమ్మ, కార్యదర్శి రత్నరాజు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ గౌడ్, ఏఎన్‌ఎంలు, ప్రజలు పాల్గొన్నారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలి


వ్యాక్సిన్ వివరాలను ఆరాతీస్తున్న వైద్యులు

సంబేపల్లె : 60 సంవత్సరాలు నిండినవారు, ఇంతకముందు క్షయవ్యాధితో బాధపడుతున్న వారు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని జిల్లా హెచ్ఐవీ, టీబీ పర్యవేక్షణ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కత్తివాండ్లపల్లెలో అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటిలో క్షయవ్యాధి బాధపడుతున్న వారికి, వారి ఇంటిలో షుగర్‌వ్యాధితో బాధపడుతున్న వారికి ఈ టీకా తప్పనిసరిగా వేయాలన్నారు. అనంతరం వివిధ వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీపై ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ గంగన్న యాదవ్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, 104 డీఈఓ బాలకృష్ణ మహరాజ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఐద్వా నాయకులు

చిట్వేలి : రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని సీఐటీయూ, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం మండలంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై దాడులు అనేక రూపాలలో జరుగుతున్నప్పటికీ అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ రాష్ట్రంలోను, దేశంలోను ప్రతి గంటకు మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నా మహిళా చట్టాలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు, బాలింతలకు రక్షణ కల్పించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా నాయకులు జాన్ ప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి సుజాత, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, ఐద్వా మండల నాయకులు నందు, లీలమ్మ, శంకరమ్మ, పద్మ, అంగన్‌వాడీ నాయకురాలు శుభరత్న, రేవతి, నాగమణి, సాంతి, భాను తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


పరశురాంను సన్మానిస్తున్న మౌలాలీ, శ్రీనివాసులు

గాలివీడు : రాష్ట్ర వాల్మీకి యూత్‌వింగ్ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బండి వెంకటసాయి పరశురాంను అర్చన కళాశాల ప్రిన్సిపాల్ మౌలాలి, రీడ్స్ సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. గురువారం ఆయన నివాసంలో కలిసి వీరిరువురు దుశ్శాలువా, పూలమాలలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ నేతలు డీఈఓ ప్రకాష్‌రెడ్డిని కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ జీఓ నంబరు 117ను రద్దుచేసి జీఓ నం 53 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతోపాటు 1 నుండి 5 తరగతుల వరకు ఓకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి వెంటనే స్పందించి ప్రభుత్వ విద్యారంగ సమస్యల తక్షణమే పరిష్కరించాలంటూ కోరారు. అనంతరం ఈమేరకు డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు చంద్రశేఖర్, సురేంద్రారెడ్డి, దావుద్దీన్, ప్రసాద్, హాఫీజుల్లా, రాజారమేష్, ఆదిల్, చంద్రశేఖర్, రఖీబ్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న టమాటా ధరలు


మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ : టమాటా ధరలు తగ్గుతున్నాయి. దిగుబడులు పెరుగుతుండటంతో ధరల్లో మార్పులు కన్పిస్తున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో కొన్ని రోజుల క్రితం కిలో రూ.88 పలికిన టమాటా గురువారం కిలో రూ.38 పలికింది. వారం రోజుల క్రితం 850 మెట్రిక్ టన్నులు కాయలు రాగా గురువారం 1,328 మెట్రిక్ టన్నులు వచ్చాయి. మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి రైతులు కాయలు తీసుకువస్తున్నారు. ధరలు పుంజుకోవడంతో చాలా మంది రైతులు టమాటా సాగుపై ఆసక్తి చూపారు. ఇటీవల రైతులు టమాటా కోతలు కోయడంతో దిగుబడులు రోజు రోజుకు పుంజుకున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కాయలు వస్తున్నాయి. దీంతో ధరలు తగ్గుతున్నాయి. దిగబడులు పెరిగితే ధరలు ఇంకా తగ్గుముఖం పడుతాయని వ్యాపారవర్గాలు తెలిపుతున్నాయి.

పదవీ విరమణ పొందిన సైనికులకు సత్కారం


సైనికులను సత్కరించిన ఎస్ఐ హుస్సేన్, మండల వాసులు

సుండుపల్లె : జూలై 26న కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకుని గురువారం రాత్రి సుండుపల్లెలో నాలుగు రోడ్ల కూడలి వద్ద సైనిక అమరవీరులకు కొవ్వొత్తుల వెలుతురులో నివాళులర్పించారు. అలాగే పదవీ విరమణ పొందిన సైనికులకు సుండుపల్లి ఎస్ఐ హుస్సేన్ ఆధ్వర్యంలో సత్కరించారు. సైనికుల త్యాగాలను కొనియాడారు. సైనికుల త్యాగాల వలనే మనం ప్రశాంతంగా జీవించగలుగుతున్నామని ఈ సందర్భంగా ఎస్ఐ తెలియజేశారు. కార్గిల్ అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేశారు.

ప్లాస్టిక్ క్రయ, విక్రయాలు చేస్తే చర్యలు


స్వాధీనం చేసుకున్న వాటర్ పాకెట్ల బస్తాలను పరిశీలిస్తున్న కమిషనర్ వాసుబాబు

రాయచోటి అర్బన్ : పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ క్రయ, విక్రయాలను జరిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. పట్టణంలోని దుకాణాలకు ఆటోల ద్వారా సరఫరా చేస్తున్న 4వేల వాటర్ ప్యాకెట్లను ఆయన మున్సిపల్ అధికారులతో కలసి స్వాధీనం చేసుకున్నారు. వాటిని చెత్త సేకరణలో వేయించి కంపోస్టు యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ అధికారుల అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లలో తినే, తాగే వస్తువులను ప్యాక్ చేసి క్రయ, విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వాటర్‌ప్యాకెట్లను తరలిస్తున్న ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తూ మరోమారు చేయవద్దంటూ హెచ్చరికలు జారీచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జునతో పాటు సచివాలయాల సిబ్బందిలు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల దోపిడీని అరికట్టండి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ప్రైవేటు బస్సు ఆపరేటర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆయన మంత్రిని కలిశారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు బస్సు ఆపరేటర్లు డిమాండ్‌ను బట్టి టికెట్ల ధరలను పెంచేస్తున్నారన్నారు. కొన్ని సందర్భాలలో విమానం ధరలకు ఏమాత్రంగా తీసిపోకుండా పెంచి ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. కొన్ని బస్సులకు రవాణా శాఖ అనుమతులు లేనప్పటికీ దర్జాగా నడుపుతున్నారన్నారు. పెద్ద ఎత్తున ముడుపులు పుచ్చుకుంటున్న ఆర్‌టీఓ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతోనే ఈ పరిస్థితి చోటుచేసుకుంటోందన్నారు. ఇప్పటికైనా ఆర్‌టీఓ అధికారులు స్పందించి ప్రైవేటు బస్సులపై ఆకస్మిక దాడులు నిర్వహించి బస్సు టికెట్ల ధరలను నియంత్రించాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం మంత్రికి ఈమేరకు వినతిపత్రం అందచేశారు.

చీకటివాండ్లపల్లెలో వైద్య శిబిరం


మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి వినోద్

రామాపురం : అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లెలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న వారికి రక్తపరీక్షలు, చికిత్సలు నిర్వహించామన్నారు. వర్షాకాలం కావడంతో ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు ఉండాలని, కాచిన వేడి నీళ్ల వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఇల్లు తిరిగి మురికికుంటలో బ్లీచింగ్ పౌడర్, శానిటైజర్‌ను పిచికారీ చేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో అనారోగ్య పరిస్థితులలో విద్యార్థులకు రక్తపరీక్షలు, పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండేలా చూడాలని పాఠశాల ఉపాధ్యాయులకు వైద్యాధికారి సూచించారు. రాత్రి సమయంలో ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని ఆయన సూచించారు. గ్రామంలో సుమారు 40 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో 10 మంది జ్వరాల బారిన పడినట్లు ఆయన తెలిపారు. జ్వరం ఉన్నవారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సకాలంలో పోషకాహారం అందించాలి


ఆయాలకు సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ అధికారి

వీరబల్లె : అంగన్‌వాడీ టీచర్లు తమ కేంద్రాలను సక్రమంగా నడపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతమ్మ తెలిపారు. గురువారం వీరబల్లి–1 సెంటర్‌లో వీరబల్లి, వంగిమళ్ల, గడికోట పంచాయతీలలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వస్తున్న పోషకాహార పదార్థాలను పిల్లలకు సకాలంలో అందిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఒకటో తరగతికి వెళ్లాల్సిన విద్యార్థులను తప్పక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. రికార్డులను సక్రమంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే


నీలకంఠ్రావుపేట జెడ్పీ హెచ్ఎస్ పక్కన డంప్‌యార్డును తలపిస్తున్న దృశ్యం

రామాపురం : నీలకంఠ్రావుపేటతోపాటు గువ్వలచెరువు, కల్పనచెరువు, బండపల్లె, కుమ్మరపల్లె, దూదేకులపల్లె, రాచపల్లి, చిట్లూరు, సరస్వతిపల్లె, తదితర గ్రామాలలో పారిశుధ్య లోపం తీవ్రంగా ఉంది. గ్రామాలలో మురికి నీటితో సహా చెత్త కుప్పలు వీధులలో దర్శనమిస్తున్నాయి. నీలకంఠ్రావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు, ఉర్దూ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే. వర్షాకాల సీజన్ అయినందున ఆ చెత్తకుప్పలపై వర్షపు నీరు నిలవడంతో ఇటు తరగతి గదులతో పాటు బయట పాదచారులు వెళ్లాలన్న దుర్గంధం వెదజల్లుతోంది. పగటిపూటనే దోమల సంచారం తీవ్రంగా ఉంది. అంతేకాకుండా కుళాయిలకు వచ్చే మంచినీరు గ్రామాలలో కుళాయిలకు ట్యాపులు లేకపోవడంతో నీరు వీధులలో నిలిచి బురదమయమైంది. చెత్తకుప్పలు పేరుకుపోవడంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థినులు

నందలూరు : నూతన జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందోత్సాహాల నడుమ పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా గురువారం నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. భిన్నత్వంలో ఏకత్వం, ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమాల్లో వివిధ రకాల వేషధారణలు, ఆటపాటలతో ఆకట్టుకున్నారు. భరతమాత, గాంధీ, నెహ్రూ తదితర వేషాలలో దేశభక్తి గీతాలతో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసీ స్వర్ణలత, గౌరీ, ఆర్‌వీ రమణమ్మ, గీతా, రమణమ్మ, ప్రమీల రేచల్, ఆనందాచారి, నాగేంద్ర ప్రసాద్, గంగనపల్లి వెంకటరమణ, ఎస్.లక్ష్మీనారాయణ, రవి శంకర్ రెడ్డి, గొంటుముక్కల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండూరులో ఆధార్ క్యాంపు

పెనగలూరు : మండలంలోని కొండూరు – 1 సచివాలయం, పొందలూరు గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆధార్ కార్డులో ఎలాంటి పొరపాట్లు ఉన్నా ఈ స్పెషల్ క్యాంపులో సరిచేసుకోవచ్చని వారు తెలియజేశారు. గురువారం నల్లపరెడ్డిపల్లి, పెనగలూరు సచివాలయాలలో స్పెషల్ క్యాంపు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ముగిసిన స్కౌట్స్ శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్ : నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో వారంరోజుల పాటు నిర్వహించిన స్కౌట్స్ బేసిక్ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. శిక్షణ ముగింపు కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులను సన్మార్గంలో నడిపేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యదర్శి డి. ప్రమీల మాట్లాడుతూ 7రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు చక్కగా శిక్షణ పొందారన్నారు.